

హత్యా.. ప్రమాదమా?

కలసపాడు మండలంలో ఓ యువతి అను మానాస్పద స్థితిలో మృతి చెందింది. ఆమె ప్రమాదానికి గురైందా? లేదా హత్య చేశారా అనే విషయం తేలాల్సి ఉంది. -8లో



మానవత్వం పెనవేసిన బంధం

రక్తదాతలను బంధువుల కంటే ఎక్కువగా భావిస్తారు. రక్తం ఇచ్చిన వారెవరో తెలియక పోయినా.. తమ ప్రాణం నిలబడినందుకు వారి మధ్య రక్తసంబంధం ఏర్పడుతుంది. -8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 35.2/27.3

జిల్లాలో శుక్రవారం 27.3 - 35.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.3 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

డీఎస్సీ పరీక్షకు 127 మంది గైర్హాజరు

కడప ఎడ్యుకేషన్: జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న డీఎస్సీ ఆన్‌లైన్ పరీక్షకు శుక్రవారం 127 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. ఉదయం సెషన్‌లో 8 పరీక్షా కేంద్రాలకు సంబంధించి 1510 మందికి గాను 1415 మంది హాజరు కాగా 95 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం విడతలో 1510 మందికి గాను 1478 మంది హాజరు కాగా 32 మంది గైర్హాజయ్యారు. మొత్తం 3020 మందికి గాను 2893 మంది హాజరు కాగా 127 మంది గైర్హాజరయ్యారు.

బాధ్యతల స్వీకరణ



పౌర సంబంధాల శాఖ ఏడీ పద్మజ

కడప సెవెన్‌రోడ్స్: సమాచార పౌర సంబంధాల శాఖ జిల్లా సహాయ సంచాలకులు (ఏడీ)గా పద్మజ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిత్తూరు జిల్లాలో సహాయ సంచాలకులుగా విధులు నిర్వహిస్తూ సాధారణ బదిలీపై ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమానికి, ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని సంక్షేమ పథకాలు, అధికార కార్యక్రమాలను మీడియా ద్వారా మరింత విస్తృతం చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఏఈఐఈ శ్రీనివాస రావు, డివిజనల్ పీఆర్వో సునీల్ సాగర్, పీఆర్వో రవికుమార్, ఏపీఎస్ నాగయ్య, రికార్డ్ అసిస్టెంట్ ఈశ్వరయ్య, సిబ్బంది ఏడీని కలిసి అభినందనలు తెలియజేశారు.

నేరాల నియంత్రణే లక్ష్యం




రూరల్ ఎస్ఐకి సూచనలు ఇస్తున్న జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్

బద్వేలు అర్బన్ : నేరాల నియంత్రణే లక్ష్యంగా పని చేయాలని జిల్లా ఎస్పీ ఈజీ అశోక్ కుమార్ పోలీస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం బద్వేలు అర్బన్, రూరల్ పోలీస్‌స్టేషన్‌లను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలు, రికార్డులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ బద్వేలు ప్రాంతంలో భూకబ్జాలు, నకిలీ పట్టాల సమస్యలు అధికంగా ఉన్న నేపథ్యంలో నకిలీ పట్టాలని తేలితే సంబంధిత వ్యక్తులపై వెంటనే కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అర్బన్ సీఐ రాజగోపాల్, ఎస్ఐలు ఎం.సత్యనారాయణ, కె.శ్రీకాంత్, కె.జయరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోత.. వేత

- అన్నదాత సుఖీభవలో అడ్డగోలు నిబంధనలు
- జిల్లాలో 30,422 మంది రైతులకు మొండిచేయి
- 2023-24లో 2,10,481 మందికి లబ్ధి
- నేడు 1,80,059 మందితో అర్హుల జాబితా విడుదల
- 2024-25లో ఎగ్గొట్టిన కూటమి ప్రభుత్వం
- ఆందోళనలో రైతాంగం



కడప అగ్రికల్చర్: అన్నదాత సుఖీభవ కింద రైతులకు అందించే పెట్టుబడి సాయంలో కూటమి ప్రభుత్వం భారీగా కోత పెడుతోంది. గత వైఎస్సార్‌సీపీ పాలనలో అర్హత కలిగిన ప్రతి రైతుకు వైఎస్సార్ రైతు భరోసా కింద పెట్టుబడి సాయం అందింది. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన మొదటి (2019-20) ఏడాది నుంచే రైతు భరోసా కింద పెట్టుబడి సాయం అందించి వెన్నుదన్నుగా నిలిచింది. 2019-20 నుంచి 2023-24 వరకు ఏటా లబ్ధి పొందే రైతుల సంఖ్య పెరుగుతూ వచ్చింది. కూటమి ప్రభుత్వం మాత్రం అన్నదాత సుఖీభవ కింద లబ్ధి పొందే వారి సంఖ్యలో భారీగా కోత విధించడంపై రైతుల్లో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. గత సంవత్సరం మే నెలలో జరిగిన ఎన్నికల సమయంలో.. కూటమి సూపర్‌సిక్స్‌లో భాగంగా రైతులకు ఏటా అన్నదాత సుఖీభవ కింద రూ. 20 వేలు చెల్లిస్తామని ఊరువాడా ప్రకటించింది. తీరా అధికారంలోకి వచ్చాక రైతు సంక్షేమాన్ని విస్మరించింది. 2024-25లో అన్నదాత సుఖీభవ కింద రైతులకు అందించే పెట్టుబడి సాయాన్ని ఎగ్గొట్టింది. 2025-26లో ఈ పథకాన్ని అమలు చేస్తోంది. అయితే గత వైఎస్సార్‌సీపీ ఇచ్చినంత మంది రైతులకు కాకుండా.. అందులో భారీగా కోత పెట్టింది. దీనిపై అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

గతంలో కంటే తక్కువ మందికి..

గత వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం 2023-24లో వైఎస్సార్ రైతు భరోసా కింద జిల్లాలో 2,10,481 మంది రైతులకు పెట్టుబడి సాయం అందించింది. కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ కింద జిల్లాల వారిగా అర్హత కలిగిన రైతుల జాబితాను విడుదల చేసింది. వైఎస్సార్ కడప జిల్లాలో పెట్టుబడి సాయానికి అర్హత సాధించిన రైతులు 1,80,059 మంది మాత్రమే ఉన్నారు. 2023-24లో పెట్టుబడి సాయం పొందిన రైతుల సంఖ్యతో పోలిస్తే.. ఇప్పుడు 30422 మంది రైతులకు మొండిచేయి చూపుతుండటం గమనార్హం.

ఈకేవైసీకి వారం రోజులే గడువు



అన్నదాత సుఖీభవ పథకం వర్తించాలంటే.. రైతులు తమ పరిధిలోని రైతు సేవా కేంద్రాలకు వెళ్లి ఈ నెల 20వ తేదీలోపు బయోమెట్రిక్ ద్వారా ఈకేవైసీ చేయించుకోవాల్సిందేనని అధికారులు చెబుతున్నారు. గడువు చూస్తే కేవలం ఏడు రోజులే ఉంది. మరి ఇంత మంది రైతులు వారం రోజుల్లో ఈకేవైసీ చేయించుకోవడం సాధ్యమేనా అని రైతులు, రైతు సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోజుకు 25 వేల మందికి పైగా రైతులు ఈకేవైసీ వేస్తే తప్ప ఈ లక్ష్యం పూర్తికాదు. మరి ఇది సాధ్యమేనా అని రైతులు ప్రశ్నిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికి కేవలం 8 వేల మంది రైతులు మాత్రమే ఈకేవైసీ వేశారు. ఇంకా 1,72,059 మంది ఈకేవైసీ వేయాల్సి ఉంది. వీరంతా మరో వారం రోజుల్లో ఈవేవైసీ వేస్తేనే అన్నదాత సుఖీభవకు అర్హులని అధికారులు చెబుతున్నారు. మరి ఇది సాధ్యమేనా అని రైతులు వాపోతున్నారు. ఈకేవైసీకి గడువు పెంచాలని రైతులు, రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

» ఎన్నికల సమయంలో...

ఎన్నికల సమయంలో పీఎం కిసాన్‌కు సంబంధం లేకుండా రూ.20 వేల పెట్టుబడి సాయం రైతులకు ఇస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పుడేమో పీఎం కిసాన్‌తో కలిసి ఇవ్వడానికి రంగం సిద్ధం చేశారు. కుటుంబంలో ఎంత మందికి భూమి ఉంటే ప్రతి ఒక్కరికి రూ.20 వేలు పెట్టుబడి సాయం అందిస్తామని చెప్పింది. ఇప్పుడేమో కుటుంబం యూనిట్‌గా అమలుకు సిద్ధమైనట్లు తెలిసింది.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతులకు అందిన వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ నిధులు

సంవత్సరం	రైతుల సంఖ్య	విడుదలైన నిధులు (రూ.కోట్లలో)
2019-20	2,06,708	279.93
2020-21	2,08,747	280.06
2021-22	1,99,344	269.11
2022-23	2,02,598	235.68
2023-24	2,10,481	126.25

లబ్ధిదారుల సంఖ్య తగ్గించరాదు



జిల్లాలో అన్నదాత సుఖీభవ లబ్ధిదారుల సంఖ్యను 30 వేలకు పైగా తగ్గించడం సబబుగా లేదు. లబ్ధిదారుల సంఖ్యను తగ్గించకుండా ఎన్నికల ముందు చెప్పిన విధంగా రూ.20 వేలను ఈ ఖరీఫ్ సాగు ఖర్చులకు గాను ఒకే విడతలో విడుదల చేయాలి. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత 3వ ప్రధాన వ్యవసాయ సీజన్ ప్రారంభమైనందున విడతల వారీగా కాకుండా ఒకే విడతలో రైతు ఖాతాలకు జమ చేయాలి. అలాగే కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందజేసి అన్నదాత సుఖీభవ నిధులను వారికి కూడా అందించాలి. – పోతిరెడ్డి భాస్కర్, ఏపీ రైతు సంఘం, జిల్లా ప్రధాన కార్యదర్శి

గడువు పొడిగించాలి



అన్నదాత సుఖీభవ నిధుల విడుదలకు సంబంధించి అర్హులైన రైతులు ఈ నెల 20వ తేదీలోపు ఈకేవైసీ వేయాలని అధికారులు గడువు ప్రకటించారు. జిల్లాలో 1,80,059 మంది రైతులుంటే కేవలం ఏడు రోజులు గడువు ఇస్తే ఎలా ఈకేవైసీ వేస్తారు. ముందుగానే సర్వర్స్ సరిగా పనిచేయవు. దీనికితోడు గడువు ప్రకటించడం సబబు కాదు. ఈ గడువును పొడిగించాలి. – బి.దస్తగిరిరెడ్డి, జిల్లా కార్యదర్శి, ఏపీ రైతు సంఘం

ప్రతి రైతు ఈకేవైసీ చేయించుకోవాలి



జిల్లాలో అన్నదాత సుఖీభవ జాబితాలో ఉండే ప్రతి రైతు ఈకేవైసీ చేయించుకోవాలి. జిల్లా వ్యాప్తంగా 1,80,059 మంది రైతులు ఈకేవైసీ వేయాల్సి ఉండగా.. శుక్రవారం నాటికి 8 వేల మంది వేశారు. మిగతా వారంతా వారి పరిధిలోని రైతు సేవా కేంద్రాలలో ఈ నెల 20వ తేదీలోపు ఈకేవైసీ వేయాలి. – చంద్రానాయక్, జిల్లా వ్యవసాయ అధికారి

డీఐపీఆర్వోకు ఆత్మీయ వీడ్కోలు



బదిలీపై వెళ్తున్న వారిని సత్కరిస్తున్న కార్యాలయ సిబ్బంది

కడప సెవెన్‌రోడ్స్: శ్రీ సత్యసాయి జిల్లా డీపీఆర్వోగా బదిలీపై పుట్టపర్తికి వెళుతున్న వైఎస్ఆర్ కడప జిల్లా సమాచార పౌరసంబంధాల శాఖ డీఐపీఆర్వో పి.వేణుగోపాల్ రెడ్డిని ఆ శాఖ అధికారులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ ప్రాంగణంలోని సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో ఆయనకు ఆత్మీయ వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీఆర్వోతోపాటు బదిలీపై వెళ్తున్న డివిజనల్ పీఆర్వో మస్తాన్ సాహెబ్, సీనియర్ అసిస్టెంట్ జయశాంత శరీఫాలను ఆ కార్యాలయ అధికారులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. వారికి పుష్పగుచ్ఛాలు అందించి దుశ్శాలువ, జ్ఞాపికలతో సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు, సిబ్బంది వారి మనోభావాలను వ్యక్తం చేస్తూ.. బదిలీ అయిన వారితో వారికి విధి నిర్వహణలో ఉన్న అనుభవాలు, అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఎలాంటి విమర్శలు, వివాదాలకు తావు లేకుండా శాఖాధిపతిగా డీఐ పీఆర్వో వేణుగోపాల్‌రెడ్డి చేసిన సేవలను కొనియాడారు.

- ఈ సందర్భంగా డీపీఆర్వో వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ కడప కార్యాలయంలో విధి నిర్వహణలో సహాయ సహకారాలు అందించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. ఈ ప్రాంత వాతావరణం, ఇక్కడి మీడియా మిత్రుల అభిమానం, అధికారులు సిబ్బంది సమన్వయ సహకారం తనకు ఎప్పటికీ గుర్తుండిపోతాయన్నారు. ఈ సందర్భంగా డీఈఐఈ శ్రీనివాస రావు, డివిజనల్ పీఆర్వో సునీల్ సాగర్, పీఆర్వో రవికుమార్, ఏపీఎస్ నాగయ్య, రికార్డ్ అసిస్టెంట్ ఈశ్వరయ్య, ఫొటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లు, టైపిస్టులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్స్ టీచర్ల బదిలీల షెడ్యూల్ విడుదల

కడప ఎడ్యుకేషన్: రాయలసీమ పరిధిలోని మోడల్ స్కూళ్లలో పని చేస్తున్న ప్రధానోపాధ్యాయులు, పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్లు, ట్రెయిన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్ల బదిలీల కోసం ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేసింది. ఈ ప్రక్రియ పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో చేపట్టనున్నారు. సంబంధిత టీచర్లు తమ దరఖాస్తులు, అభ్యంతరాలను, వెబ్ ఆప్షన్లను సమర్పించాలి.

- 13న హెచ్‌ఎంలు, పీజీటీలు, టీజీటీలు తమ స్వీయ ప్రమాణిత వివరాలతో బదిలీకి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ప్రవేశిక సీనియారిటీ జాబితా, అర్హత పాయింట్ల ఆధారంగా జాబితా వెబ్‌సైట్‌లో ప్రదర్శిస్తారు.
- 14న అభ్యంతరాలు ఉంటే సంబంధిత ఆధారాలతో వెబ్‌సైట్ ద్వారా సంబంధిత అధికారి వద్దకు సమర్పించాలి. అనంతరం సంబంధిత అధికారి ద్వారా అభ్యంతరాల పరిష్కారం జరిగి తుది సీనియారిటీ జాబితా అర్హత పాయింట్లతో వెబ్‌సైట్‌లో ఉంచుతారు. ఆపై ప్రధానోపాధ్యాయులు, పీజీటీలు, టీజీటీలు వెబ్ ఆప్షన్లు ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది.
- 15న బదిలీ స్థానాల కేటాయింపు ప్రక్రియ పూర్తి అవుతుంది.

సకాలంలో పూర్తి చేయాలి

బదిలీ ప్రక్రియలో పాల్గొనేవారు ప్రభుత్వం సూచించిన తేదీలలో తప్పని సరిగా సంబంధిత కార్యాచరణను సకాలంలో పూర్తి చేయాలి. పూర్తి వివరాలకు, తాజా సమాచారానికి అధికారిక వెబ్‌సైట్ https://apmstransfers.apcfss.in/loginను సందర్శించాలి. – కాగిత శ్యాముల్, ఆర్‌జేడీ, పాఠశాల విద్య

కొమ్మినేనికి బెయిల్ ప్రభుత్వానికి చెంపపెట్టు

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి



కడప కార్పొరేషన్ : సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావుకు సుప్రీంకోర్టు బెయిల్ ఇవ్వడం కూటమి ప్రభుత్వానికి చెంపపెట్టు అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కొమ్మినేనికి బెయిల్ ఇస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం సంతోషదాయకమన్నారు. మూడేళ్లలోపు శిక్షపడే కేసులకు 41ఏ కింద నోటీసులు ఇచ్చి విడుదల చేయాలని సుప్రీంకోర్టు ఉత్తర్వులు స్పష్టంగా ఉన్నాయన్నారు. కానీ కూటమి ప్రభుత్వం అవేమీ పాటించకుండా డిబేట్‌లో ఓ విశ్లేషకుడు చేసిన వ్యాఖ్యలను యాంకర్‌కు, ప్రసారం చేసిన ఛానెల్‌కు ఆపాదించడం దారుణమన్నారు. చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం ఒక పథకం ప్రకారం సాక్షి కార్యాలయాల వద్ద ఆందోళనలు చేయించి, రౌడీ మూకలతో దాడులు చేయించిందన్నారు. పరిపాలనలో పూర్తిగా విఫలమైన ప్రభుత్వం ప్రజల వాక్ స్వాతంత్ర్యాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తోందని ధ్వజమెత్తారు.

కేఎస్ఆర్‌పై కేసు కక్ష పూరిత చర్య



సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాసరావుకు ఎలాంటి నోటీసులను ఇవ్వకుండా అక్రమంగా అరెస్ట్ చేయడం ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిది. 30 ఏళ్ల అనుభవం వున్న సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాసరావు టీవీ రంగంలో కూడా గత 15 ఏళ్ల నుంచి యాంకరింగ్ నిర్వహిస్తున్నారు. టీవీ డిబేట్‌లలో యాంకరింగ్ చేసే సీనియర్ పాత్రికేయులకు, డిబేట్‌లో పాల్గొనే విశ్లేషకుల అభిప్రాయాలకు సంబంధం లేకపోయినా.. కేఎస్ఆర్‌పై అక్రమ కేసు బనాయించడం వాక్ స్వాతంత్ర్యానికి విఘాతం కలిగిస్తోంది. ఈ సంఘటన ప్రభుత్వ కక్షపూరితంగా వ్యవహరించిన చర్యగా భావించాల్సి వస్తోంది. పత్రికా, మీడియా కార్యాలయాలపైన దాడులను చేయించడం ఎంతవరకు సమంజసం. వ్యక్తుల, మీడియా స్వేచ్ఛను హరించే విధంగా ప్రవర్తిస్తే ప్రభుత్వ మనుగడకు ముప్పు వాటిల్లక తప్పదు. – వీజీ రాఘవరెడ్డి, వైఎస్సార్ జిల్లా కడప న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు

పిల్లలపై పోలీసు జులుం

- టీడీపీ జెండాలను తొలగించారని మైనర్లపై కేసు
- అరెస్ట్ చేసి.. రిమాండ్‌కు తరలింపు
- మా పిల్లలకు సంబంధం లేదంటున్న తల్లిదండ్రులు
- ఎవరో పీకిన వాటికి బాధ్యులను చేశారని ఆవేదన
- మా వారిని చూపించాలని స్టేషన్ ఎదుట నిరసన



పులివెందుల అర్బన్ పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన తెలుపుతున్న మైనర్ల తల్లిదండ్రులు

పులివెందుల రూరల్: పులివెందుల అర్బన్ పోలీస్‌స్టేషన్ ఎదుట శుక్రవారం ఉద్రిక్త వాతావరణం నెలకొంది. గురువారం కదిరి రోడ్డులో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి టీడీపీ జెండాలు, తోరణాలను తొలగించారని కనంపల్లెకు చెందిన బాలాజీ నాయక్‌తో పాటు ముగ్గురు మైనర్లను గురువారం పోలీసులు అరెస్టు చేసి తీసుకెళ్లారు. దీంతో ఇప్పటి వరకు ఆచూకీ లేకపోవడంతో మా పిల్లలను చూపించాలని వారి తల్లిదండ్రులు శుక్రవారం పులివెందుల పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన తెలిపారు. అరెస్టు చేసి 24 గంటలవుతున్నా పిల్లలను చూపించలేదని, కడప డీటీసీలో ఉంచారని, అలాగే ఇతర స్టేషన్ల చుట్టూ తిప్పుతూ కొడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఏవరో జెండాలు తొలగిస్తే.. తమ పిల్లలను బాధ్యులను చేయడం దారుణమని వాపోయారు. వారు ముగ్గురూ మైనర్లేనని, ఇంటి వద్ద ఆడుకుంటుండగా బాలాజీ నాయక్ పిలిచుకుని వెళ్లారని తెలిపారు. బాలాజీ నాయక్ ఒక్కడే జెండాలను పీకి కాల్చినట్లు ఒప్పుకున్నారని మైనర్ల తల్లిదండ్రులు పోలీసులకు వివరించారు. దీంతో డీఎస్పీ మురళీ నాయక్, సీఐ చాంద్ బాషాలు.. స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలతో మాట్లాడారు. నిజంగా మీ పిల్లలు ఎటువంటి తప్పు చేయకపోతే ఇంటికి పంపించేస్తానని, తప్పు చేసి ఉంటే తప్పనిసరిగా జైలుకు వెళ్లాల్సి వస్తుందని తెలియజేశారు.

మైనర్ పిల్లలపై అక్రమ కేసు నమోదు

టీడీపీ నాయకులు క్రియేట్ చేసిన వీడియో ఆధారంగా గురువారం రాత్రి బాలాజీ నాయక్‌తోపాటు ముగ్గురు మైనర్ పిల్లలపై పులివెందుల పోలీసులు అక్రమ కేసు నమోదు చేశారు. టీడీపీ జెండాలు తొలగించారని సంజీవ్ అనే వ్యక్తి వీరిని అడ్డుకున్నట్లుగా.. అతనిపై పిల్లలు దాడి చేసినట్లుగా పోలీసులు ఎఫ్ఐఆర్ రాసుకుని కేసు నమోదు చేశారు. మైనర్ పిల్లలు ఏదైనా పొరపాటు చేస్తే పోలీసులు వారి తల్లిదండ్రులను పిలిచి కౌన్సెలింగ్ ఇవ్వాలి. అలా కాకుండా పులివెందుల పోలీసులు టీడీపీ నాయకుల ఆదేశాల మేరకు కేసు నమోదు చేయడం జరిగింది.

పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన

గురువారం సాయంత్రం పోలీసులు మైనర్ పిల్లలను అరెస్టు చేయడంపై శుక్రవారం పిల్లలకు సంబంధించిన తల్లిదండ్రులు, వారి బంధువులు పులివెందుల అర్బన్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. తమకు ఏ పార్టీకి సంబంధం లేదని, తమ పిల్లలను గురువారం సాయంత్రం 7 గంటల సమయంలో పోలీసులు అరెస్టు చేసి తీసుకెళ్లారని, పలు స్టేషన్లలో వారిని కొడుతున్నారని, మా పిల్లలను చూపించాలని ఆందోళన చేపట్టారు. కనీసం తల్లిదండ్రులకు పోలీసులు సమాచారం కూడా ఇవ్వలేదని వాపోయారు. దీంతో డీఎస్పీ మురళీ నాయక్ వచ్చి మీ పిల్లలు తప్పు చేయకుంటే ఇంటికి వస్తారని, తప్పు చేస్తే జైలుకు వెళ్తారని తెలిపారు.

జువైనైల్ హోంకు..

గురువారం రాత్రి జరిగిన సంఘటనలో మైనర్ పిల్లలను కడప జువైనైల్ హోంకు రిమాండ్‌కు తరలించినట్లు తెలుస్తోంది. అలాగే బాలాజీ నాయక్‌ను జమ్మలమడుగు కోర్టులో ప్రవేశపెట్టినట్లు సమాచారం.

» కోటింగ్

గురువారం సాయంత్రం జరిగిన విషయంలో నలుగురు నిందితులను అరెస్టు చేసిన పోలీసులు గురువారం అర్ధరాత్రి వారిని కడప డీటీసీకి తరలించినట్లు సమాచారం. అక్కడ పోలీసులు వారిపై థర్డ్ డిగ్రీ ప్రయోగించినట్లు తెలిసింది. అయితే మైనర్ పిల్లలపై ఈ విధంగా పోలీసులు టీడీపీ నాయకుల ఆదేశాల మేరకు థర్డ్ డిగ్రీ ప్రయోగించడం ఎంత వరకు సమంజసమని ప్రజా సంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు.



వైఎస్సార్‌సీపీ నాయకులపై కూడా..

గురువారం సాయంత్రం జరిగిన సంఘటనలో టీడీపీ నాయకుల ఆదేశాల మేరకు పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులపై అక్రమ కేసు నమోదు చేసినట్లు తెలుస్తోంది. నలుగురు పాల్గొన్నట్లు టీడీపీ నాయకులే మీడియా వారికి వీడియో విడుదల చేశారు. అయితే దీని ఆధారంగా చేసుకుని వైఎస్సార్‌సీపీలో క్రియాశీలకంగా ఉన్న పలువురి నాయకులపై ఈ కేసులో పేర్లు నమోదు చేసినట్లు సమాచారం. దాదాపు 12 మందిపై ఈ కేసులో అక్రమంగా పేర్లు చేర్చినట్లు తెలుస్తోంది.

ఎటువంటి తప్పు చేయలేదు



ఇంటి వద్ద ఆడుకుంటున్న మా పిల్లవాడిని బాలాజీ నాయక్ తీసుకొని వెళ్లాడు. మా కొడుకు జెండాలు పీకలేదు, మా వాడికి ఎటువంటి సంబంధం లేదు. అయినా పోలీసులు తీసుకెళ్లి ఎక్కడున్నాడో చూపించకుండా కొడుతున్నారు. ఇది చాలా దారుణం.మా పిల్లలను మాకు చూపించాలి. – రెహ్మాన్, మైనర్ పిల్లవాడి తండ్రి, పులివెందుల

మాకు ఏ పార్టీతో సంబంధం లేదు



మేము పులివెందుల పట్టణంలో నివాసముంటున్నాం. ఏ పార్టీతో సంబంధం లేదు. కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాం. టీడీపీ జెండాలు పీకారని మా కుమారుడిని పోలీసులు అరెస్టు చేసి ఎక్కడ ఉంచారో తెలియదు. ఇలా చేయడం మంచి పద్ధతి కాదు. – మల్లేశ్వరి, మైనర్ పిల్లవాడి తల్లి, పులివెందుల

మైనర్లనూ వదలని టీడీపీ నాయకులు



పులివెందుల రింగ్ రోడ్డు సమీపంలో ఉన్న టీడీపీ తోరణాలు



చెత్త, ఎండిపోయిన చెట్లు కాల్చివేసి.. జెండాలు కాల్చినట్లుగా వీడియోలో చూపిస్తున్న ప్రాంతం

పులివెందులలో టీడీపీ నాయకులు కక్షపూరిత రాజకీయాలను కొనసాగిస్తున్నారు. రెండు వారాల క్రితమే కేవలం మహానాడు సందర్భంగా పులివెందుల రింగ్ రోడ్డు ప్రాంతాలలో వైఎస్సార్ విగ్రహాల చుట్టూ టీడీపీ నాయకులు అత్యుత్సాహంతో టీడీపీ జెండాలు, తోరణాలు కట్టడం జరిగింది. దీనిపై అప్పట్లోనే వైఎస్సార్‌సీపీ నాయకులు మున్సిపల్ కమిషనర్, పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో వైఎస్సార్‌సీపీ నాయకులు వాటిని తొలగించడం జరిగింది. కేవలం వాటిని తొలగించారనే కారణంతో టీడీపీ నాయకులు పోలీసుల ద్వారా వారిపై అటెంప్ట్ మర్డర్ కేసు, దొంగ అక్రమ కేసులో జైలులో ఉంచడం జరిగింది. అయితే గురువారం సాయంత్రం కనంపల్లెకు చెందిన బాలాజీ నాయక్ అనే యువకుడు వైఎస్సార్ మీద అభిమానంతో కదిరి రింగ్ రోడ్డులో వైఎస్సార్ విగ్రహం చుట్టూ ఉన్న టీడీపీ జెండాలను తొలగించారు. అయితే బాలాజీ నాయక్ తనతోపాటు తన బంధువుల పిల్లలైన మైనర్ పిల్లలను వెంట తీసుకుపోయారు. ఇందులో బాలాజీ నాయక్ టీడీపీ తోరణాలను తొలగించి పక్కన వేయడం జరిగింది. మైనర్ పిల్లలకు ఎటువంటి సంబంధం లేదు. ఇక్కడే టీడీపీ నాయకులు నీచ రాజకీయాలకు తెర లేపారు. తోరణాలు కాల్చకున్నా కూడా కాల్చినట్లుగా అదే ప్రాంతంలో పక్కన ఉన్న కంపచెట్లలో మంటను రాజేసి తోరణాలను కాల్చినట్లుగా వీడియో క్రియేట్ చేశారు.



సికిందర్ హుస్సేన్‌కు లెజెండ్ అవార్డు

– 50 సార్లు రక్తదానం చేసినందుకు సన్మానం



మహమ్మద్ సికిందర్‌ను సన్మానిస్తున్న జెకె వేల్ఫేర్ సోసైటీ సభ్యులు

కడప ఎడ్యుకేషన్ : నగరంలోని 27వ డివిజన్ గౌస్ నగర్‌లో శుక్రవారం జెకె జనం కోసం యూత్ వెల్ఫేర్ సొసైటీ వారి ఆధ్వర్యంలో 50 సార్లు రక్తదానం చేసిన మను పాలిటెక్నిక్ కళాశాల ప్రొఫెసర్ మహమ్మద్ సికిందర్ హుస్సేన్‌ను ఘనంగా సత్కరించి లెజెండ్ అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సొసైటీ వ్యవస్థాపకులు లయన్ పటాన్ ఖాదర్‌బాషా మాట్లాడుతూ అన్ని దానాల కన్నా రక్తదానం మిన్న అన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలన్నారు. రక్తదానం చేయడంతో పాటు ఎంతో మందిని అవగాహన చేసిన మహమ్మద్ సికిందర్ అభినందనీయుడన్నారు. నేటి యువత అతడిని ఆదర్శంగా తీసుకొని మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకులు అమానుల్లా షేక్, నారాయణ, జాకీర్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
జమ్మలమడుగు ప్రధాన శాఖ (0977), జమ్మలమడుగు, వైయస్ఆర్, కడప జిల్లా.

స్వాధీనతా ప్రకటన

రూల్ నెం. 8(1)మరియు(2) క్రింద (స్థిరాస్తి కోసం)

ఖాతా నెంబర్లు: 32856520432 క్యాష్ క్రెడిట్, 32777131328 హౌసింగ్ లోన్, 40183574488 (ఎస్‌బిఐ సురక్ష)

[illegible]

స్థిరాస్తుల వివరాలు

[illegible]

క్ర. సం.	ఖాతా నెం.	ఋణగ్రహీత పేరు	పరిమితి	తేది:14.03.25 నాటికి మొత్తం బకాయి
01	40800451310 ఎడ్యుకేషనల్ లోన్	శ్రీమతి బావికట్టి సుభాషిణి(పేరెంట్) బావికట్టి గిరి వేదరమేష్‌కుమార్(విద్యార్థి)	రూ.7,60,000	రూ.8,90,355.00
02	42032018747 ఎడ్యుకేషనల్ లోన్	శ్రీమతి బావికట్టి సుభాషిణి(పేరెంట్) బావికట్టి రేవంత్‌కుమార్ (విద్యార్థి)	రూ.7,50,000	రూ.4,36,485.00
03	38453050848 కార్ లోన్	శ్రీమతి బావికట్టి సుభాషిణి భర్త బి.మంగళ రవికుమార్	రూ.7,85,000	రూ.2,38,025.00
			మొత్తం	రూ.15,64,865.10

ప్రదేశం : జమ్మలమడుగు
తేది : 09.06.2025

సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ NWAC/ NIOS, BOARDS ద్వారా 10th, Inter ఫెయిల్ అయిన వారికీ మీ విద్యా సంవత్సరం వృధా కాకుండా Degree, B.Tech, MBBS ఎందులో అయినా చేరే అవకాశం. NWAC EXAMS JULY 2025 SUGAN CAREER GUIDANCE., SERVICE Y.JUNCTION, KADAPA. Contact: 9949393809, 9391543345

REAL ESTATE

PLOT FOR SALE

■ తూ.గో జిల్లా కాకినాడ, దేవాలయం వీధి లో షాపులకి వీలుగా CMR Jewellery మాల్ ఎదురుగా, 6 ఫీట్ దారి తో 330 చ.గ.లు అమ్మకమునకు కలదు. డైరెక్ట్ పార్టీలు మాత్రం. సంప్ర:9848188703

SERIVCES

BOREWELLS

■ బోర్ పాయింట్ చూడబడును. జై గురుదత్త K.V రమణ M.Sc geologist భూగర్భ జల పరిశోధన సెల్ : 6302328007.

PERSONAL CARE

CHANGE OF NAME

■ I,VEMPALLI MUGENNA GARI RAVI CHANDRA REDDY S/O V.M.PEDDA SUBBA REDDY R/O D.NO:30/347-347-51-7,MSR HILL VALLEY,NEAR BIG WATER TANK,UKKAYAPALLE,KADAPA,YSR KADAPA DIST,A.P.PREVIOUSLY MY WIFE NAME AS CHAPPIDI LAKSHMI PRASANNA (OLD NAME). NOW I CHANGE MY WIFE NAME AS VEMPALLI MUGENNA GARI LAKSHMI PRASANNA (NEW NAME)

■ I, VEMPALLI CHAKRAVARTHI REDDY (Old Name)S/o Late V.DevendraReddy,R/o Samalavaripalli,H/o TalapulaPost,Piler(M),Annamayya District, A.P., I have changed my name. Henceforth, I will be known as VEMPALLI CHAKRAPANI REDDY.(New Name)

WANTED

■ హారూన్ ఆటోమోటివ్ త్రీ వీలర్ షో రూమ్ నందు పనిచేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, మరియు కంప్యూటర్ ఆపరేటర్ కావలెను. బద్వేల్ సంప్ర:9440260831,9603854564

■ త్రినేత్ర హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను చంటిపిల్లలను చూసుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ.18K. Ph: 8520980099, 8520874499

■ కష్టలేన్సి కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు / పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు,RMP&డ్రైవర్స్ కావలెను. జీ. 15 వేలు -40వేలు,ఫ్రీరూం+భోజనం.Hyd.9014885406

■ సూళ్ళూరుపేటలో ప్రముఖ కాఫీ పరిశ్రమ కు క్యాజువల్ వర్కర్స్, గార్డెన్ వర్కర్స్ కావలెను. రూమ్, క్యాంటీన్ సౌకర్యం కలదు ✆ 70939 24466, 81427 61777

■ ప్రముఖ MNC కంపెని ఆఫీస్‌లో వర్క్ చేయుటకు అనుభవం గల స్త్రీ / పురుషులు కావలెను. అర్హత 10th – డిగ్రీ జీతం 20 వేలు నుంచి. Ph: 99084 29239

■ Wanted female Techers, with any degree +B.E.d to teach English, Social Calsses 3-7 Contact: Sri Saraswathi Vidya mandir, YMR Colony, Proddatur. Cell : 9652738539

■ WANTED TEACHERS :- కడప పట్టణంలో ప్రముఖ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ నందు 8వ తరగతి నుండి 10 తరగతి వరకు. Telugu, Hindi, English, Social, I.I.T. foundation Chemistry బోధించుటకు అర్హత అనుభవం కలిగిన ఉపాధ్యాయులు మరియు హాస్టల్ వార్డెన్లు ,ఉదయం సాయంత్రం వేళల యందు స్టడీ అవర్స్ నిర్వహించుటకు ట్యూటర్స్ కావలెను. Cont:9292607689, 9849794289.

గమనిక

[illegible]

సాక్షి క్లాసిఫైడ్స్ కొరకు సంప్రదించండి
9705907418
9705944423
9010223797
9010072409

మానవత్వం పెనవేసిన బంధం

నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం





రక్తదానం చేస్తున్న యువతతో నగర ప్రముఖులు (ఫైల్)

కడప కల్చరల్ : రక్తదానం చేయడమంటే అదో గొప్పతనం. ఓ మనిషికి నిండు ప్రాణం నిలుపడంలోని ఔన్నత్యం. ఇలా మానవత్వం గొప్పతనం గురించి ఎంత చెప్పినా తనివి తీరదు. నీరు లేకుంటే ఒకరోజైనా బతకవచ్చుగానీ, అవసరమైన సమయంలో రక్తం లభించకపోతే ప్రాణాలు కోల్పోయే ప్రమాదముంది. అవసరమై ఎంత ప్రాధేయపడినా రక్తదానం చేసేవారు చాలా అరుదుగా కనిపిస్తారు. శనివారం ప్రపంచ రక్తదాతల దినోత్సవ సందర్భంగా 'సాక్షి' అందిస్తోన్న ప్రత్యేక కథనం.

రక్తదాతలు..ప్రాణదాతలతో సమానం

రక్తదాతలను బంధువుల కంటే ఎక్కువగా భావిస్తారు. అవసరమైనపుడు వారు మనలా ఎందరికో ప్రాణాలు దక్కేందుకు కారకులవుతారు. అందుకే అలాంటి సమయంలో రక్తదానం చేసే వారిని ప్రాణదాతలంటారు. రక్తం ఇచ్చిన వారెవరో తెలియకపోయినా ఆ రక్తంతో తమ ప్రాణం నిలబడినందుకు వారి మధ్య రక్త సంబంధం ఏర్పడుతుంది. జిల్లాలో రికార్డు స్థాయిలో రక్తం ఇచ్చిన దాతగా ప్రొద్దుటూరుకు చెందిన గురివిరెడ్డిని పేర్కొంటారు. రక్తదానాన్ని ఉద్యమంగా తీసుకెళ్లి ప్రజల్లో అవగాహన కల్పించిన బోగా పార్వతమ్మ రక్తదాన సేవా సమితి వ్యవస్థాపకులు బోగా చిన్నయ్య, పోరుమామిళ్లకు చెందిన జ్ఞాన సరస్వతి చారిటుబల్ ట్రస్టు వ్యవస్థాపకులు యనమల శ్రీనివాసులు, రక్తదాన ప్రచారమే పెద్ద వ్యాపకంగా పూర్తి స్థాయిలో ప్రచారం, అవగాహన నిర్వహిస్తున్న పట్టుపోగుల పవన్‌కుమార్... వీరి స్ఫూర్తితో ప్రస్తుతం జిల్లాలో 100కు పైగా స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు కూడా రక్తదాన సేవలు అందిస్తున్నారు. రాజకీయ పార్టీలు కూడా స్పందించి పార్టీలో ఓ విభాగాన్ని రక్తదానం కోసం ఏర్పాటు చేయడం గమనార్హం. ఈ రంగం నుంచి తప్పుకున్నా మిగతా వారిలో మరికొందరు యువత ముందుకు వచ్చి ఆ బాధ్యతను తాము మోసేందుకు సిద్ధమంటున్నారు. వాళ్లలో రక్తంతోపాటు ఆత్మవిశ్వాసం కూడా మెండుగా ఉందని పేర్కొంటున్నారు. ప్రస్తుతం వేగం తగ్గినా మొన్నటివరకు బోగా చిన్నయ్య రక్తదాన ఉద్యమకర్తగా గొప్ప కీర్తి ప్రతిష్ఠలు సాధించారు. ఇతరులను ప్రోత్సహిస్తూ మరెందరికో స్ఫూర్తినిస్తున్న ఆయనను మిగతావారంతా ఆదర్శంగా తీసుకోవాల్సి ఉంది. లక్షలాది రూపాయలు స్వంత నిధులు వెచ్చించి రక్తదాన ఉద్యమంలో తాను ప్రధానపాత్ర పోషించారు.

ఖూన్‌కా రిస్తా

నగరంలో 2015లో సంస్థ ఏర్పాటైంది. స్థానిక యువకులు ఎం.తారిఖ్ అలీ, ఎస్‌ఎండీ గౌస్‌ఖాన్‌లు స్థాపించారు. రక్తం కొరతతో ఎవరికీ ప్రాణాపాయం కలగకూడదన్న భావనతో ఏర్పాటైన ఈ సంస్థ కర్ణాటక, తెలంగాణ, మహారాష్ట్రలతోపాటు జిల్లాలోని ఇతర పట్టణాల్లో కూడా సేవలందిస్తోంది. రక్తం అవసరమున్న వారు 99481 04130 నెంబరులో సంప్రదిస్తే వెంటనే తమ సభ్యులను సంప్రదించి అవసరమైన రక్తదాతను ఏర్పాటు చేస్తున్నారు. ఇటీవల కాలంలో ఈ రంగంలో యువతలో జోష్ నింపేందుకు నాటి క్రికెట్ క్రీడాకారుడు అజారుద్దీన్‌ను వ్యయ ప్రయాసలు వెచ్చించి రక్తదాతల్లో ఉత్సాహం నింపారు. ఐపీఎల్ క్రికెటర్ పైడికాల్వ విజయ్‌కుమార్‌తో కూడా పలు శిబిరాలకు హాజరవుతూ యువతలో ఉత్సాహాన్నినింపుతున్నారు. ఇప్పటివరకు రాష్ట్ర వ్యాప్తంగా 580 శిబిరాలు నిర్వహించి 20407 మంది రక్తదానం చేసేలా కృషి చేశారు. అలాగే శిబిరాలతోపాటు రక్త నిర్ధారణ శిబిరాలు నిర్వహించారు. జిల్లాలో మంచి రక్తదాన సంస్థగా అతి తక్కువ సమయంలోనే ఈ సంస్థ పేరు గడించింది.

లైఫ్.. ఈజీ బ్లడ్

రక్తం అంటే ప్రాణమే. అవసరమైన సమయంలో ప్రాణాన్ని కాపాడేది రక్తమేనని రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కార్యదర్శి సురేష్‌కుమార్ అంటున్నారు. రక్తదానం చేయడంలోని ఆత్మ సంతృప్తి, సేవా తత్పరత మరొకటి ప్రాణం నిలుపగలిగే అవకాశం లభించడం గొప్ప విషయమే. సమీపం నుంచి ఇలాంటి ఎందరినో రెడ్‌క్రాస్ సంస్థ ద్వారా చూస్తున్నాను. చాలాసార్లు రక్తం లేకుండా ఇబ్బందులు పడకూడదని, ఇలాంటి దురదృష్టం మరెవరికీ రాకూడదని, బాధలు పడుతున్న వారిని చూస్తున్నాను. ఇలాంటి వారికి అతి తక్కువ ధరలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లాశాఖ ఆధ్వర్యంలో కేవలం నామమాత్రపు ఛార్జీలతో ప్రజలకు అవసరమైన రక్తం అందిస్తున్నాం. సిబ్బంది అందరిలో కూడా మానవత్వపు అనుభూతి ఉండడంతో వారు కూడా బంధువుల్లా సేవలు అందించేందుకు ముందుకు వస్తున్నారు. ఈ మాత్రం సేవలు అందించే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నాను.

అందరిలో జోష్ నింపుతూ...



డాక్టర్ వేణుగోపాల్ ఇప్పటికి 110 సార్లు వ్యక్తిగతంగా రక్తదానం చేశారు. అందుకోసం ఆయనకు రాష్ట్ర గవర్నర్ ప్రత్యేకంగా రక్తదాతల దినోత్సవ సందర్భంగా ఆయనను పిలిపించి ఘనంగా సత్కరించారు. ప్రతి సంవత్సరం ఆయన రక్తదానం చేయడం ఆనవాయితీగా పెట్టుకున్నారు. ఏ చిన్న అవకాశం లభించినా స్వయంగా వెళ్లి రక్తదాతకు అవసరమైన సహకారం అందజేస్తున్నారు. ఈ చుట్టుప్రక్కల దాదాపు 110 సార్లు రక్తదానం చేయడం నిజంగా అరుదైన విషయం. డాక్టర్ వేణుగోపాల్ అన్నమయ్య జిల్లా చిట్వేలికి చెందిన వారు. చిట్వేలి హైస్కూలులో ఆయన మొదటి సోదరుడు డాక్టర్ చంద్రశేఖర్, మరో సోదరుడు దొండ్లవాగు శ్రీనివాసులు కూడా ఓవైపు సామాజిక సేవారంగంలో తలమునకలుగా ఉంటూ వేలాది మందితో మొక్కలు నాటే ఉద్యమాన్ని కొనసాగిస్తున్నారు. వేణుగోపాల్ తాను హాజరయ్యే కార్యక్రమాలతోపాటు ఇలా పలుమార్లు రక్తదానం చేసేందుకు స్ఫూర్తినిస్తున్నారు. మహిళలు కూడా ఎక్కువ మంది ఈ రంగం నుంచి రావాలన్న ఆశయంతో ఆయన మహిళలను కూడా ప్రోత్సహిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

– స్కూటీని ఢీకొన్న క్యాంపర్ వాహనం



ప్రమాదానికి కారణమైన క్యాంపర్





నంద్యాల రవి (ఫైల్), వినోద్ (ఫైల్)

కడప అర్బన్ : సొంత పని కోసం వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్న సమయంలో క్యాంపర్ వాహనం స్కూటీని ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం చెందారు. మృతులు ఇద్దరు బావాబామ్మర్దులు కావడంతో రెండు కుటుంబాలు విషాదంతో నిండిపోయాయి. కడప ట్రాఫిక్ ఎస్ఐ జయ రాములు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాలను పరిశీలించారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. కడప చలమారెడ్డి పల్లెకు చెందిన నంద్యాల రవి (32) ప్రైవేట్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. వరుసకు బావమరిది అయిన రాయచోటి వినోద్ (26) ప్రైవేట్ ఫైనాన్స్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఏడాది క్రితమే రాయచోటి వినోద్‌కు కడపకు చెందిన యువతితో వివాహం జరిగింది. వినోద్ భార్య ప్రస్తుతం గర్భిణి. సొంత పని నిమిత్తం రవి, వినోద్ ఇద్దరు కలిసి స్కూటిలో చలమారెడ్డి పల్లె నుంచి అలంఖాన్‌పల్లెకు వెళ్లారు. తిరిగి చలమారెడ్డి పల్లెలోని తమ ఇంటికి వస్తున్న సమయంలో ఎదురుగా వేగంగా వచ్చిన ఓ ప్రైవేట్ సంస్థకు చెందిన మహేంద్ర క్యాంపర్ వేగంగా వచ్చి స్కూటీని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇరువురు అక్కడికక్కడే మృతి చెందారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను రిమ్స్ మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జయరాములు తెలిపారు.

ఉత్సాహంగా అండర్–19 వన్డే క్రికెట్ టోర్నీ



లోహిత్ లక్ష్మీనారాయణ, చిత్తూరు (125 పరుగులు)



రణధీర్ రెడ్డి, కడప (65 పరుగులు)



ఆర్థిత్‌రెడ్డి, కడప (61 పరుగులు)

కడప వైఎస్ఆర్ సర్కిల్ : జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏసీఏ సౌత్ జోన్ అండర్ –19 వన్డే క్రికెట్ టోర్నమెంట్ ఉత్సాహంగా కొనసాగింది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో అనంతపురం జట్టుపై 7 వికెట్ల తేడాతో చిత్తూరు జట్టు ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు 55.0 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 229 పరుగులు చేసింది. ఆ జట్టులోని భువనేశ్వర్ 65, జయంత్ కృష్ణ 41 పరుగులు చేశారు. చిత్తూరు జట్టులోని చరణ్ 3, ప్రకాష్ రాజ్ 3 వికెట్లు తీసుకున్నారు. అనంతరం 230 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన చిత్తూరు జట్టు 33.4 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 231 పరుగులు చేసి 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఆ జట్టులోని లోహిత్ లక్ష్మి నారాయణ అద్భుతంగా బ్యాటింగ్ ప్రదర్శించాడు. 104 బంతులను ఎదుర్కొని 17 బౌండరీలు, 2 సిక్సర్ల సహాయంతో 125 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. వేదాంత్ 32 పరుగులు చేశాడు.

36 పరుగుల తేడాతో కడప జట్టు విజయం

కెఎస్ఆర్ఎమ్ క్రికెట్ మైదానంలో జరిగిన వేరొక మ్యాచ్‌లో నెల్లూరు జట్టుపై 36 పరుగుల తేడాతో కడప జట్టు విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ కు దిగిన కడప జట్టు 48.4 ఓవర్లలో 243 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని రణధీర్ రెడ్డి 65, ఆర్థిత్ రెడ్డి 61 (నాటౌట్) పరుగులు చేశారు. నెల్లూరు జట్టులోని భార్గవ్ మహేష్ 3, తోషిత్ యాదవ్ 2 వికెట్లు తీసుకున్నారు. అనంతరం 244 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన నెల్లూరు జట్టు 37.5 ఓవర్లలో 207 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయి ఓటమి చవిచూసింది. ఆ జట్టులోని తోషిత్ యాదవ్ 77, మన్విత్ 38 పరుగులు చేశారు. కడప జట్టులోని ఆర్థిత్ రెడ్డి 2, ధీరజ్ కుమార్ రెడ్డి 2, హృతిక్ రెడ్డి 2 వికెట్లు తీసుకున్నారు.

అసిస్టెంట్ లైన్‌మెన్‌పై విచారణ జరపాలి

ప్రొద్దుటూరు : తప్పుడు పద్ధతిలో ఉద్యోగం పొందిన అసిస్టెంట్ లైన్‌మెన్ మైలవరం సాయికుమార్‌పై విచారణ జరపాలని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు గోసా మనోహర్ ఒక ప్రకటనలో కోరారు. ప్రొద్దుటూరు పట్టణ పరిధిలోని సౌత్ సెక్షన్‌లో సాయికుమార్ విధులు నిర్వహిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఆయన తన తండ్రి మైలవరం శేఖర్ మరణానంతరం కారుణ్య నియామకం కింద ఉద్యోగం పొందారని తెలిపారు. ఆయన ఏవిధంగా మరణించారన్న విషయంపై సాక్ష్యాధారులు లేకుండా, డెత్ సర్టిఫికెట్ లేకుండా ఉద్యోగం పొందారన్నారు. ఈ విషయంపై ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమణారెడ్డికి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశానని తెలిపారు. ఈ విషయంపై ఈఈని సాక్షి వివరణ కోరగా గోసా మనోహర్ ఫిర్యాదుపై విచారణ చేపట్టాలని ఏడీఈకి బాధ్యతలు అప్పగించామన్నారు. ఆయన బదిలీపై వెళ్లడంతో విచారణ ఆగిందని, కొత్తగా వచ్చిన ఏడీఈతో విచారణ పూర్తి చేయిస్తామని తెలిపారు.

బదిలీలను పారదర్శకంగా నిర్వహించాలి



ఆర్డీ డాక్టర్ రామగిడ్డయ్యకు వినతిపత్రం సమర్పిస్తున్న ఏపీ ఎన్జీవో అసోసియేషన్ నాయకులు

కడప రూరల్ : వైద్య ఆరోగ్యశాఖలో నిర్వహించే బదిలీలను పారదర్శకంగా నిర్వహించాలని ఏపీ ఎన్జీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం స్థానిక ఆ శాఖ ప్రాంతీయ కార్యాలయంలో రీజినల్ డైరెక్టర్ డాక్టర్ రామగిడ్డయ్యకు వినతి పత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏపీ ఎన్జీవో అసోసియేషన్ ఆఫీస్ బేరర్లకు బదిలీల అంశానికి సంబంధించి ప్రభుత్వం ఇచ్చిన తొమ్మిదేళ్ల మినహాయింపును ఇవ్వాలన్నారు. బదిలీలను పారదర్శకంగా చేపట్టాలని కోరారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు అందజేశారు. కార్యక్రమంలో కర్నూలు జిల్లా అధ్యక్షులు వెంగల్ రెడ్డి, అనంతపురం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, రాష్ట్ర సహాయ అధ్యక్షులు దస్తగిరి రెడ్డి, ఉపాధ్యక్షులు ప్రసాద్ యాదవ్, జిల్లా కార్యదర్శి రవికుమార్, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో నిందితుల అరెస్టు

ముద్దనూరు : మండలంలోని దేనేపల్లె గ్రామంలో ఈనెల 10వ తేదీన జరిగిన హత్యాయత్నం కేసులో నిందితులను పోలీసులు శుక్రవారం సాయంత్రం అరెస్టు చేశారు. గ్రామంలోని రామ్మోహన్ అనే వ్యక్తిపై అదే గ్రామానికి చెందిన ఐదుగురు వ్యక్తులు దాడి చేశారు. ఈ ఘటనలో రామ్మోహన్ తలకు తీవ్రగాయాలయ్యాయి. హత్యాయత్నం కింద నమోదైన ఈ కేసులో నిందితులైన గూనివాండ్ల శివ, శివశంకర్, నరసింహ, ఉత్తయ్యలను అరెస్టు చేసినట్లు, మరో మైనర్ బాలుడిని కడపలోని జెవైనెల్ హోంకు తరలించనున్నట్లు సీఐ తెలిపారు.

కడపలో పేలిన ఐపీ బాంబ్

కడప అర్బన్ : కడప నగరంలోని చిన్నచౌక్ పోలీస్ స్టేషన్ ప్రాంతంలో ఓ వ్యక్తి ఐపీ బాంబ్‌ను పేల్చాడు. తనకు పరిచయమైన వ్యక్తుల నుంచి, బంధువుల నుంచి రూ. 1 వడ్డీతో డబ్బులను తీసుకుని, బయటి వ్యక్తులకు రూ. 3 నుంచి 5 రూపాయల వడ్డీలకు డబ్బులను అప్పుగా ఇచ్చేవాడు. ఈక్రమంలో తాను తీసుకున్న అప్పును తిరిగి ఇవ్వకుండా కోర్టులో రూ.కోటి 30 లక్షలకు ఐపీ పిటీషన్‌ను దాఖలు చేసినట్లు సమాచారం.

రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య



కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప-కృష్ణాపురం రైలుమార్గంలో శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి మృతి చెందినట్లు రైల్వే ఎస్ఐ తెలిపారు. మృతునికి 30–35 సంవత్సరాల వయస్సు ఉంటుందన్నారు. మృతుడు తెల్లని ఫుల్‌షర్ట్‌పై బ్లూ కలర్ పూలు ఉన్నాయని, బ్లూ కలర్ లోయర్ ధరించి ఉన్నాడన్నారు. మృతుడు సున్తీ చేయించుకుని మొలతాడు ధరించి ఉన్నాడన్నారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు కడప రైల్వే ఎస్ఐ (సెల్ నెంబరు 94409 00811)కు సమాచారం అందించాలన్నారు.

ఉరి వేసుకుని మహిళ మృతి



మృతి చెందిన అనురాధ

కాశినాయన : మండలంలోని ఓబుళాపురం గ్రామానికి చెందిన నీలం అనురాధ (23) ఉరి వేసుకుని మృతి చెందింది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. శుక్రవారం సాయంత్రం 4 గంటల సమయంలో ఇంటిలో ఎవరు లేని సమయంలో తలుపు గడియ వేసుకుని ఉరి వేసుకున్నట్లు తెలిపారు. మృతురాలి భర్త వెంకటేశ్వర్లు సీఆర్‌పీఎఫ్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. మృతురాలికి నాలుగు సంవత్సరాల కూతురు ఉందని తెలిపారు.

హత్యా.. రోడ్డు ప్రమాదమా?



మృతురాలిని పరిశీలిస్తున్న పోరుమామిళ్ల ఎస్ఐ



ఎలిజబెత్ (ఫైల్)

కలసపాడు/పోరుమామిళ్ల : మండలంలోని జాతివర్థిపల్లె – చింతలపల్లె మధ్యలో శుక్రవారం ఎల్జిబెత్ (22) సామాజిక కార్యకర్త అనే యువతి అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. పోరుమామిళ్ల మండలం కవలకుంట్ల గ్రామానికి చెందిన నారిపోగు ఓబయ్య కుమార్తె ఎల్జిబెత్ తమిళనాడులో మహిళలు, యువతులకు కుట్టు మిషన్‌లో శిక్షణ ఇప్పిస్తూ సామాజిక సేవ చేస్తున్నట్లు గ్రామస్తుల ద్వారా తెలిసింది. రెండు నెలల క్రితం ఎల్జిబెత్‌కు పెళ్లి సంబంధం చూస్తుండగా ఆమె తిరస్కరించినట్లు తెలుస్తోంది. శుక్రవారం జాతివర్థిపల్లె – చింతలపల్లె మధ్య ప్రధాన రహదారిలో ఎల్జిబెత్ విగత జీవిగా పడి ఉందన్నారు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోరుమామిళ్ల, కలసాపాడు పోలీసులు అక్కడికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతురాలి సోదరుడు, బాబాయిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోరుమామిళ్ల ఆస్పత్రికి తరలించారు. ఈ విషయంపై కలసపాడు ఎస్ఐ తిమోతిని వివరణ కోరగా ఎల్జిబెత్ కారు ప్రమాదానికి గురై మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలి తండ్రి ఓబయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

మా నాలుక మందమో.. మీ చర్మం మందమో ప్రజలే తేలుస్తారు

- తల్లికి వందనం పథకం చెప్పింది ఎంత మందికి.. ఇచ్చింది ఎంత మందికి?
- సూపర్ 6 పథకాలు అమలు చేశామని ఏవిధంగా చెబుతున్నారు
- మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : తమ ప్రభుత్వం సూపర్– 6 పథకాలను అన్ని అమలు చేసినట్లేనని.. ఎవరైనా విమర్శిస్తే వారి నాలుక మందమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పడం ఆశ్చర్యంగా ఉందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. విమర్శించిన వారి నాలుక మందమో.. పథకాలు అమలు చేయకుండా ఎగ్గొట్టిన వారి చర్మం మందమో ప్రజలే నిర్ణయిస్తారని చెప్పారు. ఆయన శుక్రవారం తన స్వగృహంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మొత్తం రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులందరికి 67,27,164 మందికి తల్లికి వందనం అమలు చేసినట్లు ప్రకటించిన చంద్రబాబు నాయుడు, ఆయన కుమారుడు లోకేష్ బాబు ఇస్తున్నది మాత్రం 54,94,500 మందికి మాత్రమే అన్నారు. ఇంకా 14 లక్షల మంది విద్యార్థులకు వారు చెప్పిన ప్రకారం వర్తింపజేయాల్సి ఉందన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఒక్కో విద్యార్థికి జగనన్న అమ్మ ఒడి పథకాన్ని 44 లక్షల మందికి అమలు చేశారని, ఇద్దరు విద్యార్థులకు ఈ పథకాన్ని అమలు చేసినప్పుడు ఇంకెంత మందికి వర్తింపజేయాల్సి ఉంటుందని ప్రశ్నించారు. 83 లక్షల మంది విద్యార్థులకు ఈ పథకాన్ని వర్తింపజేయాల్సి ఉందని గతంలో చంద్రబాబు, లోకేష్ జగన్‌ను విమర్శించారన్నారు. ఇది అమ్మ ఒడి కాదు అర్ధ ఒడి అని వారు విమర్శించారని, మరి ఇప్పుడు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పథకం పావల ఒడినా అన్నారు. మరుగుదొడ్ల నిర్వహణకు సంబంధించి అమ్మ ఒడి పథకంలో రూ.1000 కట్ చేస్తే నానా యాగి చేసిన చంద్రబాబు, లోకేష్ ఇప్పుడు రూ.2వేలు ఏవిధంగా కట్ చేశారని ప్రశ్నించారు. తల్లికి వందనం పథకం మొత్తంలో అనేక అవకతవకలు ఉన్నాయని తెలిపారు. ఉదాహరణకు మండలంలోని తాళ్లమాపురం గ్రామంలో జగనన్న ప్రభుత్వంలో 549 మందికి అమ్మ ఒడి పథకం వర్తిస్తుండగా ఇప్పుడు 509 మందికి మాత్రమే వచ్చిందన్నారు. 300 యూనిట్లు విద్యుత్ అని, రకరకాల కారణాలతో కోత విధించారన్నారు. ఆగస్టు 15 నుంచి ఉచిత బస్సు పథకాన్ని అమలు చేస్తామని ప్రకటించారన్నారు. కేవలం పల్లె వెలుగుల బస్సులనే ఈ పథకంలో ఏర్పాటు చేస్తారని, జిల్లాలను దాటకుండా హద్దులు విధించే అవకాశం ఉందన్నారు. ఉచిత సిలిండర్ల పథకం 100కి 30 మందికి మాత్రమే అమలవుతోందని రాచమల్లు స్పష్టం చేశారు. ఎన్నికలప్పుడు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రూ.6వేలుతోపాటు రాష్ట్ర ప్రభుత్వం రూ.20వేలు ఇస్తామని ప్రకటించారని, ఇప్పుడేమో రెండు కలిపి రూ.20వేలు ఇస్తామని చెప్పడం తగునా అని ప్రశ్నించారు.

ఆ రెండు పథకాల పరిస్థితి ఏమిటి ?

చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ప్రధాన కారణం ఆడబిడ్డ నిధి పథకం అని రాచమల్లు తెలిపారు. ఈ పథకాన్ని ఇప్పటి వరకు ప్రభుత్వం అమలు చేయకపోగా పీ4 విధానంలో అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించిందన్నారు. మన దేశానికి సంబంధించి విదేశాల్లో ఉన్న ఎన్ఆర్‌ఐలు ఇక్కడ ఉన్న పేదలను ధనవంతులుగా చేసేందుకు చర్యలు తీసుకుంటారని చెప్పడం జరిగిందన్నారు. ఇది సాధ్యమేనా అని రాచమల్లు ప్రశ్నించారు. పీ4 విధానం గురించి ప్రజలకు కనీస అవగాహన ఉందా అని తెలిపారు. నిరుద్యోగ భృతి పథకం పరిస్థితి కూడా అంతేనన్నారు. టీడీపీ ఎమ్మెల్యేలు ఎవరైనా ఈ రెండు పథకాలకు సంబంధించి పీ4 విధానంతోపాటు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ల ద్వారా ఉపాధి కల్పిస్తామనే ధైర్యం ఉంటే ప్రజల వద్దకు వెళ్లి చెప్పాలని అన్నారు. గత ఏడాది కాలంలో తాము సంపద సృష్టించామని ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోందని, అలాంటప్పుడు గత ఏడాదిలో రూ.1.70 లక్షల కోట్ల అప్పులు ఎందుకు తేవాల్సి వచ్చిందని ప్రశ్నించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏడాది కాలంలో 188 మంది మహిళలపై అత్యాచారాలు జరిగాయన్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం గత ఏడాదిలో సాధించిన అభివృద్ధి శూన్యమన్నారు. రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు జరుగుతున్నాయని, చిన్నారులను చిదిమేస్తున్నారని, హింస పెరిగిందని, జర్నలిజంపై దాడి చేస్తున్నారని, వైఎస్సార్‌సీపీ నాయకులపై తప్పుడు కేసులు బనాయిస్తున్నాయని విమర్శించారు. పథకాలను అమలు చేసేంత వరకు ప్రొద్దుటూరు నియోజకవర్గంగా ప్రశ్నిస్తూనే ఉంటామన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, కౌన్సిలర్లు రాగుల శాంతి, లావణ్య, ముదిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, సత్యం, చింపిరి అనిల్ కుమార్, చౌడం రవిచంద్ర, వైఎస్సార్‌సీపీ నాయకుడు గౌతం రెడ్డి పాల్గొన్నారు.